ప్రభాత జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
10-09-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 10 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




చేనేత రుణభారం 30 కోట్ల రూపాయలను తీర్చేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధంగా ఉందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. కుల, చేతి వృత్తులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులున్నారని, ఆయా సంఘాల మహిళలకు ఏటా రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

# చేనేతకు చేయూత
# 30 కోట్ల రుణమాఫీ

## ప్రజా పాలనలో కావాలి బంగారు భవిత
## అన్నగా తోడుంటా.. అన్ని విధాలా అండగ ఉంటా...

**జయభేరి, హైదరాబాద్ :**
సోమవారం హైదరాబాద్ లలితా కళాతోరణంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని వర్చువల్‌గా ప్రారంభించారు ముఖ్యమంత్రి. ఈ సందర్భంగా చేనేత అభయహస్తం లోగోలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్.. ఒకప్పుడు తెలంగాణ విద్యార్థులు హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు కోసం పొరుగునున్న ఏపీ, ఒడిషాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గడిచిన ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉన్నా ఏ మాత్రం చర్యలు తీసుకోలేదన్నారు.ఈ అంశం మా దృష్టికి వచ్చిన వెంటనే కేంద్రం దృష్టికి తీసుకెళ్లామన్నారు సీఎం. కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ భూమి ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం కొందరు పదవులు వదులుకున్నారని, కానీ కొంతమంది రాజీనామా చేసిమళ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలు తెచ్చారని గుర్తు చేశారు.ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగం చేశామని


...మిగతాది 2 లో

# అప్రమత్తంగా ఉండాలన్న రేవంత్, చంద్రబాబు



ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఫ్లాష్ ఫడ్స్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశామని.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కొండ చరియలు విరిగిపడే ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేయించామని తెలిపారు. పూర్తి వివరాలకోసం ఇక్కడ చూడండి.. భారీ వర్షా ల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పాఠశాలలకు ఇవాళ కూడా సెలవు ప్రకటించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి జిల్లాలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

2 లో






# నెల రోజుల్లో వైఖరి తేల్చండి
## స్పీకర్ కు సూచించిన హైకోర్టు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 9:**
బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. వారి అనర్హతపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అప్పటిలోగా నిర్ణయం తీసుకోకపోతే సుమోటోగా కేసు

...మిగతాది 2 లో



# ప్రజావాణికి 126 ఆర్జీలు

- ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై దృష్టి సారించాలి
- కమిషనర్ ఆమ్రపాలి కాట

**జయభేరి, హైదరాబాద్ :**
ప్రజావాణిలో వివిధ సమస్యల పై వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులకు ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారానికి నగరం

...మిగతాది 2 లో

# రాజీనామాలు.. ఎన్నికలు

- రేవంత్ కొత్త వ్యూహం




**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 9:**
తెలంగాణలో పది నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పదేళ్ల బీఆర్ఎస్ పార్టీని ఓడించిన ప్రజలు పదేళ్ల తర్వాత హస్తం పార్టీకి పట్టం కట్టారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అయితే కాంగ్రెస్ పార్టీ 64 సీట్లు గెలవగా మిత్రపక్షం సీపీఐ ఒక సీటు గెలిచింది.


...మిగతాది 2 లో

# భారత రాజకీయాల్లో గౌరవం ఉండదు



**జయభేరి, వాషింగ్టన్, సెప్టెంబర్ 9:**
ఏ ప్రాంతమైన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ టార్గెట్ ఒక్కటే. అదే బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్. ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరిని తూర్పారబట్టారారు. భారత దేశ రాజకీయ వ్యవస్థలో గౌరవం అనేది లేదని తేల్చేశారు రాహుల్‌గాంధీ

...మిగతాది 2 లో



# కాళోజీ 'గొడవ' ప్రజల గొడవ

- కాళోజీ నారాయణరావు చేసిన రచనలు మాటల తూటాలు
- నిరంకుశత్వంపై, అరాచక పాలనపై, అసమానతలపై విమర్శనాస్త్రాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్ సెప్టెంబర్ 9:**
తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు కాళోజీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

...మిగతాది 2 లో

# అందరిని కాదని మహేష్ గౌడే ఎందుకు..?

2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## అప్రమత్తంగా ఉండాలన్న...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీలోనూ హైడ్రా తరహా చట్టం తీసుకొస్తామని అన్నారు. చట్టం అమల్లోకి రాగానే మొట్ట మొదటగా బుడమేరు ఆక్రమణలే తొలగిస్తామని చెప్పారు. కొంతమంది ఆక్రమణల కారణంగా లక్షల మంది ఇబ్బంది పడుతున్నారని, దానిని చూస్తూ ఊరుకోమన్నారు. తెలంగాణలో వరదల వల్ల రూ.5,438 కోట్ల నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం వెల్లడించింది. రోడ్లు భవనాల శాఖలో రూ.2,362 కోట్లు, విద్యుత్ శాఖలో రూ.175 కోట్లు, పంటలు రూ.415 కోట్లు, నీటిపారుదల శాఖలో రూ.629 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, తాగునీటి శాఖలో రూ.170 కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.1,150 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది.
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థులకు బంపరాఫర్ ప్రకటించింది. ఆర్బీఐ ఏర్పడి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డిగ్రీ స్థాయి విద్యార్థులకు 'ఆర్బీఐ90' పేరుతో క్విజ్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహించనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభమైంది. సెప్టెంబరు 17 వరకు దరఖాస్తు చేసే అవకాశముంది. ఆన్లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించనుండగా.. విజేతలు రూ. లక్ష నుంచి రూ.10 లక్షలు గెలుచుకునే అవకాశం ఉంది.

## చేనేతకు చేయూత..

చెప్పుకుంటున్నారని విమర్శించారు సీఎం రేవంత్. గజ్వేల్‌లో ఫామ్ హౌస్ లు ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తుస్తుందని, ఐఐహెచ్‌టీకి ఆయన పేరు పెడతామన్నారు.వచ్చే ఏడాది నుంచి స్కిల్స్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీ భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఆర్భాటం, సినీ తారల తళుకు బెళుకులు తప్పా, నేతన్న ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించకుండా ఆలస్యం చేసిందని, తాము బకాయిలు చెల్లించి.. రాజకీయాలకు అతీతంగా సిరిసిల్ల కార్మికులను ఆదుకున్నామని వెల్లడించారు.నేత కార్మికుల కళ్లలో ఆనందం చూసేందుకు రూ.290 కోట్ల బకాయిలు విడుదల చేశామన్నారు. రైతన్న ఎంత ముఖ్యమో.. నేతన్న కూడా మాకు అంతే ముఖ్యమన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఐఐహెచ్‌టీ విద్యార్థులకు నెలకు రూ. 2500 ప్రోత్సాహకం అందించారు ముఖ్యమంత్రి. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నెల రోజల్లో వైఖరి తేల్చండి

విచారిస్తామని తెలిపింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని బీఆర్ఎస్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. దానిపై విచారించిన ధర్మాసనం.. తాజా ఆదేశాలు జారీ చేసింది.ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని BRS నేత హరీష్ రావు అన్నారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న అప్రజాస్వామ్య విధానాలకు చెంపపెట్టని తెలిపారు. తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పడటం ఖాయమని హరీష్‌రావు స్పష్టం చేశారు. అనర్హత కారణంగా ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో BRS గెలుపు తథ్యమని ఎక్స్ వేదికగా హరీష్‌రావు తెలిపారు.తాము పార్టీ మారినప్పుడు పార్టీని విలీనం చేశామని, కాని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగింది పార్టీ ఫిరాయింపని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మూడు నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉపఎన్నికలు వస్తాయని తెలిపారు.అనర్హత పిటిషన్ల వ్యవహారంలో స్పీకర్‌కు ఇమ్యూనిటీ ఉండదని హైకోర్టులో BRS తరపున వాదనలు వినిపించిన ప్రముఖ న్యాయవాది గండ్ర మోహన్‌రావు అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన 24 గంటల్లోనే వారిపై అనర్హత వేటు వేసిన విషయాన్ని హైకోర్టు దృష్టికి తెచ్చినట్టు ఆయన తెలిపారు. హైకోర్టు ఆదేశాలను పాటిస్తూ నాలుగు వారాల్లోగా స్పీకర్ చర్యలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మణిపూర్ ఎమ్మెల్యేల కేసును కూడా పిటిషనర్ల తరపున న్యాయవాదులు హైకోర్టుకు వివరించారు. 142 ఆర్టికల్ కింద సుప్రీంకోర్టు స్పీకర్‌కు నోటీసులు జారీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇక్కడ పార్టీ మారడమే కాకుండా మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా పోటీ చేశారని దానం నాగేందర్ ఇష్యూను కోర్టుకు వివరించారు పిటిషనర్లు.స్పీకర్‌ను ఆదేశిస్తే రెండు వ్యవస్థల మధ్య ఘర్షణపూరిత వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం తరుపున న్యాయవాదులు వాదించారు. ఈ కేసులో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. దానం, కడియం తరఫున శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంధ్యాల రవిశంకర్ కోర్టులో వాదించారు.

**నాలుగు వారాల గడువు**

పిటీషన్ల తరఫున వాదను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా పరిగణలోకి తీసుకుంది. నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఎప్పుడు నోటీసులు ఇస్తారు... ఎప్పుడు విచారణకు పిలుస్తారు. ఎప్పటి నుంచి వాదనలు వింటారు... ఎప్పటి లోపు ప్రొసీడింగ్స్ పూర్తి చేస్తారో వివరంగా షెడ్యూల్ తెలియజేయాలని ఆదేశించింది హైకర్టు. నాలుగు వారాల్లో షెడ్యూల్ రిలీజ్ చేయకపోయినా నిర్ణయం ప్రకటించకున్నా తామే ఓ నిర్ణయం చెబుతామని పేర్కొంది హైకోర్టు.

**స్వాగతించిన బీఆర్ఎస్**

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు కీలక కామెంట్స్ చేశారు. ఆయన ఏమన్నారంటే..." ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై తెలంగాణ హైకోర్ధు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ఎమ్మెల్యేల అనర్హత అప్లికేషన్లపై హైకోర్ధు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామ్య విధానాలకు చెంపపెట్టు." కాంగ్రెస్ పార్టీ విధానాలను దుయ్యబట్టారు. ఈ తీర్పుతో తెలంగాణలో ఉపఎన్నికలు రాబోతున్నాయని అన్నారు హరీష్. ఆ ఎలక్షన్స్‌లో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. "తెలంగాణ హైకోర్ధు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యం. తెలంగాణ హైకోర్ధు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం తథ్యం. అనర్హత కారణంగా ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ ఎస్ గెలుపు తథ్యం. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను గౌరవించి నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు హరీష్. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు"హైకోర్ధు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర శాసనసభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నాం." అని అభిప్రాయపడ్డారు.

## ప్రజావాణికి 126 ఆర్జీలు

నలుమూలల నుండి ప్రజలు తరలి వచ్చారు. కమిషనర్ ఆమ్రపాలి కాట ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు తెలియజేయాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 7 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 49 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 31, ట్యాక్స్ 4, ఎల్.డబ్ల్యు,ఎస్ 4, ఎలక్ట్రికల్ 2, వెటర్నరీ 2, ఎంటమాలజీ, ఎస్టేట్స్, స్పోర్ట్స్, సి.ఎం.ఓ.హెచ్, ఇంజనీరింగ్, అడ్మిన్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 70 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి 28, శేరిలింగంపల్లి 16, సికింద్రాబాద్ 11, ఎల్బీనగర్ జోన్ లో 9, చార్మినార్ జోన్ లో 4, ఖైరతాబాద్ జోన్ లో రెండు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, రఘు ప్రసాద్, సత్యనారాయణ, అడిషనల్ సిసిపి లు గంగాధర్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, యస్ సి పనస రెడ్డి, ఇరిగేషన్ యస్ ఈ నారాయణ, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అందరిని కాదని మహేష్ గౌడే ఎందుకు..?

✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 9:

ఎట్టకేలకు తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడు నియమితులయ్యారు. పార్టీలో పలువురు సీనియర్లు పీసీసీ చీఫ్ పదవికి పోటీపడినా చివరికి మహేశ్‌కుమార్‌గౌడ్ వైపే కాంగ్రెస్ హౌకమాండ్ మొగ్గు చూపింది. బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడికి పార్టీ బాధ్యతలు అప్పగించడంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెర పడింది. కీలకమైన పీసీసీ అధ్యక్ష పదవీ బాధ్యతలు దక్కించుకోవడంలో మహేష్‌కు కలిసి వచ్చిన అంశాలేంటి?తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఆయనకు కాంగ్రెస్ హైకమాండ్ ప్రమోషన్ ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో విధేయతకే పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యమిచ్చి ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. 2021 జులై నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం పీసీసీ బాధ్యతల నుంచి తప్పించింది.బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కి పీసీసీ బాధ్యతలు అప్పగించడంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిల అనంతరం 4వ పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో 2004 నుంచి 2014 మధ్యకాలంలో రెండు సార్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్ ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత అదే నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీపగ్గాలు అప్పగించడం విశేషం.గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేయడానికి మహేశ్‌కుమార్‌గౌడ్ టికెట్ ఆశించారు. అయితే కొన్ని సమీకరణాల వల్ల దక్కలేదు. కేసీఆర్ పోటీలో ఉండటంతో రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయడంతో.. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆ స్థానం నుంచి తప్పుకొని నిజామాబాద్‌కు మారాల్సి వచ్చింది. దీంతో మహేశ్‌కుమార్ గౌడ్ అసెంబ్లీకి పోటీచేసే అవకాశం కోల్పోయారు.

ఈ కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2024 జనవరిలో ఆయనను ఎమ్మెల్సీగా పార్టీ ఎంపిక చేసింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న మహేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు ఆయనను పీసీసీ అధ్యక్షపీఠంపై కూర్చోబెట్టిందంటున్నారు. ఈ పదవి కోసం మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పలువురు పోటీపడ్డారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో.. పార్టీ ప్రభుత్వం మధ్య సమన్వయం అవసరం. అందుకే రేవంత్‌రెడ్డి ఏరికోరి ఆయనకు పదవి ఇప్పించుకున్నట్లు చెప్తున్నారు.విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చి పార్టీనే అంటిపెట్టుకొని ఉండటం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమన్వయంతో పనిచేసుకుంటూ విధేయుడిగా ఉంటారనే పేరు పొందడం మహేష్‌కు కలసి వచ్చింది ... ప్రస్తుత మంత్రివర్గంలో బీసీలకు కేవలం 2 మంత్రి పదవులు మాత్రమే ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణలో బలమైన వర్గంగా గుర్తింపు పొందిన గౌడ్ వర్గానికి పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతో అధిష్ఠానం మహేశ్‌కుమార్ గౌడ్ వైపు మొగ్గు చూపినట్లు రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.పీసీసీ చీఫ్ ఎంపిక అంకం ముగిసినందున.. రాష్ట్రంలో వరద పరిస్థితులు సద్దుమణిగి సాధారణ పరిస్థితులు నెలకొన్న అనంతరం మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చని కాంగ్రెస్ నాయకులు అంచనా వేస్తున్నారు. రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ కాంబినేషన్లో తెలంగాణలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



### లోకల్ బాడీ సవాల్

స్థానిక సంస్థల ఎన్నికలే తన ముందున్న అతిపెద్ద సవాల్ అంటూ కుండబద్దలు కొట్టేశారు మహేష్ కుమార్ గౌడ్. సూటిగా సుత్తి లేకుండా తన టార్గెట్ ఏంటో ఫిక్స్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డితో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతూ, అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికలే తన ముందున్న సవాల్ అని అన్నారు. తన పదవి కోసం పోటీ చేసిన వారితోనూ కలిసి ముందు కెళ్తానని, అందర్నీ సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లోనే టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకుంటానని, ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. త్వరలోనే కమిటీలను నియమిస్తామని, ఖాళీగా ఉన్న పార్టీ పదవులను భర్తీ చేస్తామని చెప్పారు. గత పేదళ్లుగా పార్టీనే నమ్ముకున్న వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు మహేష్ కుమార్ గౌడ్.

## రాజీనామాలు.. ఎన్నికలు

తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటుకు 60 సీట్లు అవసరం. మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం 5 సీట్లే ఎక్కువగా ఉండడంతో బీఆర్ఎస్ నేతలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని ప్రచారం మొదలు పెట్టారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు హస్తం గూటికి చేరారు. మొదటగా ఖైతారాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తర్వాత భద్రాచలం ఎమ్మెల్యే తెల్లాం వెంకట్రావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ గూటికి చేరారు. తర్వాత మరో ఏడుగురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యేల పార్టీ మార్పుపై బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయ పోరాటం చేస్తున్నారు. మొదట కాంగ్రెస్లో చేరిన దానం నాగేందర్, వెంకట్రావు, శ్రీహరి కేసు విచారణ హైకోర్టులో పూర్తయింది. తీర్పు రిజర్వు చేసింది. మిగతా ఏడుగురు ఎమ్మెల్యేల కేసు కూడా త్వరలోనే తుది దశకు వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలో తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని పదే పదే చెబుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఫిరాయింపు కేసు ఇప్పుడు కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో కేటీఆర్ చెప్పిందే జరగబోతుందా అన్న చర్చ కూడా తెలంగాణలో జరుగుతోంది. కోర్టు తీర్పు రిజర్వు చేసిన నేపథ్యంలో ఎలాంటి తీర్పు వస్తుందో అన్న టెన్షన్ ఇటు గులాబీ శ్రేణుల్లో, అటు కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది.మరోవైపు తెలంగాణ సీఎం కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతోంది. కోర్టు తీర్పుకు ముందే.. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఉప ఎన్నికలు వస్తే గెలిచే అవకాశం ఉన్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. తద్వారా ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు.. బీఆర్ఎస్ నేతల నోరు మూయించడంతోపాటు ఫిరాయింపు ఆరోపణలకు చెక్ పెట్టవచ్చన్న ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా ముగ్గురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి అనర్హత వేటు పడే అవకాశం ఉండడంతో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహం మార్చినట్లు చర్చ జరుగుతోంది.

## కాళోజీ 'గొడవ'...

అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు గారి జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పించారు. ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'మన కాళోజీ 'గొడవ' ప్రజల గొడవ. అచ్చమైన తెలంగాణ వాడుక భాషలో కాళోజీ నారాయణరావు చేసిన రచనలు మాటల తూటాలు. నిరంకుశత్వంపై, అరాచక పాలనపై, అసమానతలపై విమర్శనాస్త్రాలు. ప్రతినిత్యం సామాన్యుల సమస్యలనే, హక్కుల పరిరక్షణే, ప్రజా శ్రేయస్సునే తన జీవితంగా భావించిన తెలంగాణ వైతాళికుడు కాళోజీ. ప్రజాకవిగా పేరొందిన కాళోజీ స్వాతంత్ర్య సమరయోధునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా అందించిన స్ఫూర్తి, చేసిన సేవలు అనిర్వచనీయం.మన కాళన్న గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే మహోన్నత ఉద్దేశంతోనే కేసీఆర్ గారు కాళోజీ గారి జయంతిని (సెప్టెంబర్ 9) తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించారు. వైద్య విశ్వవిద్యాలయానికి వారి పేరు పెట్టారు. వరంగల్‌లో సుందరమైన కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించారు. ధిక్కార స్వరం కాళోజీ తెలంగాణ రాష్ట్రానికే గర్వ కారణం. కాళోజీ కలం.. సామాన్యుల గళం.. ప్రజలకు బలం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## ...గౌరవం ఉండదు

ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్నారు. టెక్సాస్‌లోని ఇండో అమెరికా కమ్యూనిటీ ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారాయన. దేశానికి సంబంధించి చాలా విషయాలు బయటపెట్టారు. ప్రధాని నరేంద్రమోదీని టార్గెట్ చేస్తూ కీలక విషయాలు ప్రస్తావించారాయన.భారత దేశ రాజకీయ వ్యవస్థలో ప్రేమ, గౌరవం అనేది లేదని తేల్చిపారేశారాయన. రాజకీయ నాయకులు కులమతాలు, భాషలు, రాష్ట్రాలకు అతీతంగా అందర్నీ ప్రేమించాలని.. ప్రస్తుతం అవేమీ కనిపించలేదని మనసులోని మాట బయపెట్టారు. వీటిని తిరిగి రాజకీయాల్లోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.భారత్ అంటే ఒకే ఆలోచనని ఆర్ఎస్ఎస్ నమ్ముతోందని, తాము మాత్రం బహుళ ఆలోచనలని భావిస్తున్నామన్నారు. చట్ట సభల్లో అందరికీ ప్రాతినిధ్యం ఉండాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. కులం, భాష, సంప్రదాయాలతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ అర్హులేనన్నారు. కానీ, భారత్‌లో అందుకోసం ఇప్పుడు పోరాటం చేయాల్సి వస్తుందన్నారు.ప్రస్తుతం పాలకులు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారన్నది నిన్నటి ఎన్నికల్లో ప్రజలందరికీ అర్థమైందన్నారు. పనిలోపనిగా భారతదేశానికి నైపుణ్యాల సమస్య ఉందని చాలా మంది చెబుతారని గుర్తు చేశారు రాహుల్ గాంధీ. దేశంలో నైపుణ్యాల సమస్య ఉందని తాను అనుకోవడం లేదన్నారు. నైపుణ్యం ఉన్న వ్యక్తుల పట్ల భారతదేశానికి గౌరవం లేదన్నారు.రాజ్యాంగంపై దాడి చేసే వారెవరైనా మన సంప్రదాయంపై దాడి చేసినట్లేనని ప్రజలు అర్థం చేసుకున్నారని వివరించారు రాహుల్‌గాంధీ. అందుకే పార్లమెంటులోని తొలి ప్రసంగంలో తాను అభయముద్ర గురించి మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. తెలుగు అంటే కేవలం భాష మాత్రమేకాదని ఒక చరిత్ర అని అన్నారు. హిందీతో పోల్చి తెలుగు ను తక్కువ చేస్తే ఆ ప్రాంతం, అక్కడి చరిత్ర ముఖ్యంకాదని చెప్పినట్లేనని అన్నారు.ప్రపంచంలో చైనా ఆధిపత్యం ప్రస్తావించారు రాహుల్‌గాంధీ. దీనికారణంగా భారతదేశం, యుఎస్, ఇతర పశ్చిమాసియా దేశాలను నిరుద్యోగ సమస్య పట్టి పీడిస్తోందన్నారు. పెరుగుతున్న నిరుద్యోగాన్ని ఎదుర్కోవడానికి తయారీ రంగంలో భారతదేశం తన పాత్రను తిరిగి పొందాల్సిన అవసరాన్ని నొక్కి వక్కానించారు.పాశ్చాత్య దేశాలతోపాటు ఇండియాకు నిరుద్యోగ సమస్య ఉందన్న రాహుల్, ప్రపంచంలోని చాలా దేశాలకు ఆ సమస్యలు లేదన్నారు. ముఖ్యంగా చైనా విషయంలో కూడా. ఈరోజు తయారీ రంగంపై చైనా ఆధిపత్యం చెలాయిస్తోందని గుర్తు చేశారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఓవర్సీస్ అధ్యక్షుడు శ్యామ్ పెట్రోడాపై ప్రశంసల జల్లు కురిపించారు. రాహుల్ విద్యావంతుడని, మంచి ఆలోచనపరుడని తెలిపారు. ఆయన ఆలోచనలను లోతుగా ఉంటాయన్నారు. ఏ అంశంపైనా డీప్‌గా ఆలోచిస్తారని, ఆయన్ని అర్థం చేసుకోవడం అంత సులభం కాదన్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో వానల భయం

✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 9:

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం భారత వాతావరణ శాఖ అంచనాలకు తగ్గట్టుగానే ఒడిశాలోని పూరీ దగ్గర ఉదయం 11:30 గంటలకు తీరం దాటింది. దీని ప్రభావం రాష్ట్రంలో మరో 24 గంటల పాటు ఉంటుందని వాతావరణ అధికారులు వెల్లడించారు. వాయుగుండం అదే తీవ్రతతో సోమవారం అర్ధరాత్రి వరకూ కొనసాగుతూ బలహీనపడుతుందని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం అంచనా వేస్తోంది. శ్రీకాకుళం , విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అటు, తూ.గో, పశ్చిమగోదావరితో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే, విశాఖ, తూ.గో జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గంటకు 30 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, వాయుగుండం ప్రభావంతో దక్షిణ ఒడిశా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. మల్కాన్‌గిరిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుడమేరు వరద ప్రభావం తగ్గినందున కొంత ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో పరిస్థితులపై కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఆరా తీశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కాకినాడ, ఏలూరు, తూ.గో జిల్లాల కలెక్టర్లతో ఆయన మాట్లాడారు. కాల్వల్లో వరద ప్రవాహాలు, గట్ల పటిష్టతను డ్రోన్ల ద్వారా అంచనా వేయాలని సూచించారు. వరద తగ్గిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేయాలని.. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని నిర్దేశించారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆహారం, తాగునీరు అందించాలన్నారు. వైద్య శిబిరాలు కొనసాగించాలని పేర్కొన్నారు. అటు, విజయవాడలోని కొన్ని ఇళ్లు మినహా విద్యుత్ పునరుద్ధరణ పూర్తైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**తెలంగాణలోనూ..**

తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళ, బుధవారాల్లోనూ కొన్నిచోట్ల వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# ఆర్థిక సంఘం సమావేశంలో పాల్గొన్న మేయర్ అమర్ సింగ్




**జయభేరి, మేడిపల్లి :**

పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులతో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పణగారియా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ తరపున పలు అంశాలను మేయర్ అమర్ సింగ్ ఆర్థిక సంఘం దృష్టికి తీసుకెళ్లారు.

**మేయర్ అమర్ సింగ్ చేసిన విజ్ఞప్తులు**

1. యానిమల్ బర్త్ కంట్రోల్ కోసం తమ పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ) నుంచి ఒక్కో దానికి దాదాపు రూ.1,600 ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు.
2. 2011 జనాభా లెక్కల ప్రకారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ జనాభా 55,000గా ఉందని, అయితే, ఇప్పుడు జనాభా దాదాపు 1,25,000 పెరిగినట్టు అంచనా ఉందని తెలిపారు. జనాభా అంచనాకు తగ్గట్టుగా మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
3. యూఎల్‌బీ బడ్జెట్ నుంచి ప్రతి ఏడాది 10 శాతాన్ని గ్రీన్ బడ్జెట్‌గా కేటాయిస్తున్నట్లు చెప్పారు. దీనికి సైతం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని ప్రోత్సాహకం నిధులు కేటాయించాలని కోరారు.
4. ప్రభుత్వ స్థలాలు, పార్కులు అన్యాక్రాంతం కాకుండా జియోఫెన్సింగ్ చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన సాంకేతికతను యూఎల్‌బీకి కేంద్రం అందించాలని, జియోఫెన్సింగ్ కోసం అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు.
5. స్ట్రాటజిక్ నాలా డెవెలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌డీపీ)లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యక నిధులు విడుదల చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ గారిని కోరారు.
6. ఇంటి పన్నులు అధికంగా విధించడం వల్ల సామాన్యులు ఇబ్బంది పడుతున్నందున, ఇంటి పన్నులను పునఃపరిశీలించి, తగ్గించాలని సీడీఎంఏ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అమ్రాపాలి, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో పాటు రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.






## గణనాథుల ప్రత్యేక పూజలు

**జయభేరి, ఉప్పల్ :**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లక్ష్మీ నగర్, ఇంద్రనగర్ ఫేజ్ 2 కాలనీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కంటెస్టెడ్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్. అనంతరం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని, కార్పొరేటర్ ప్రభుదాస్, ముఖ్య అతిథులను శాలువాలతో గౌరవించుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సంక్షేమ సంఘం ప్రతినిధులు రామోహన్ రావు, కోటిరెడ్డి, రాజారెడ్డి, సదానందం, సతీష్, భూక్యా కాళే, శోభ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా ఉండాలి

- ఏబీ న్యూ లైఫ్ హాస్పిటల్ వారి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుంగతుర్తి రవి



**జయభేరి, మేడిపల్లి :**

ఏ.బి. న్యూ లైఫ్ హాస్పిటల్ లో ప్రతిష్టించిన గణేశుని వద్ద, హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏ.బి. న్యూ లైఫ్ హాస్పిటల్ చైర్మన్ డా. బాలకృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ డా. అనిల్ కుమార్, మేడిపల్లి వీరాంజనేయ స్వామి ఆలయ డైరెక్టర్ ఎర్ర అయిలేష్ యాదవ్, జనరల్ ఫిజిషియన్ డా. నిశాంత్, అంజనకుమార్, జలగం శరత్ గౌడ్, గిరీష్ కుమార్, మచగిరి, శ్రీనివాస్, శ్రీధర్, హరీష్, శేషు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన చేప పిల్లల పంపిణీ చేయాలి

- తెలంగాణ మత్స్యకార సంఘం చైర్మన్ ను కలిసిన షాద్ నగర్ నగర్ ముదిరాజులు
- నాణ్యమైన చేప పిల్లలను అందించాలని కోరిన మంగా మధు, అంచ రాములు, తుమ్మల గోపాల్



**జయభేరి, షాద్ నగర్ :**

మత్స్యకారులకు ఆర్థికంగా ఎదిగేందుకు నాణ్యమైన చేప పిల్లలను అందించాలని తెలంగాణ మచ్చ సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్ ను షాద్ నగర్ ముదిరాజ్ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూలమాలలతో సత్కరించారు. అనంతరం కాసేపు వారితో ముచ్చటించారు. చేపల పై ఆధారపడే జీవన ఉపాధి కొనసాగిస్తున్న కుటుంబాలకు నాణ్యమైన చేప పిల్లల పంపిణీ అందించేలా కృషి చేయాలని మంగ మధు ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్ సానుకూలంగా స్పందించి సంఘం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు రుణాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం వంటి తదితర అంశాలపై ప్రభుత్వం తరపున సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంచ రాముల ముదిరాజ్, తుమ్మల గోపాల్ ముదిరాజ్, మంగ మధు ముదిరాజ్, గూడూరు సురేష్ ముదిరాజ్, నరసింహ ముదిరాజ్, కళేశ్ ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్, శివకుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీగోడ నిర్మాణ అభివృద్ధి పనులు



**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ మల్కాజిగిరి నియోజకవర్గంలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ లో ముస్లింలకు కబ్రస్థాన్ ప్రహరీగోడ నిర్మాణ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హాజ్ కమిటీ మెంబెర్ ముజీబుద్దీన్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ సీసా వెంకటేష్ గౌడ్, కార్పొరేటర్ చీరాల నర్సింహా, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాళోజీ చిరస్మరణీయులు

- మేయర్ అమర్ సింగ్

**జయభేరి, మేడిపల్లి :**

ప్రజాకవి కాళోజీ నారాయణరావుకి పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ నివాళులర్పించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన కాళోజీ జయంతి కార్యక్రమంలో అమర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాళోజీ రచనలు ఇప్పటికీ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ సాహితీ ప్రస్థానంలో కాళోజీది ప్రత్యేక అధ్యాయమని, ఆయన చిరస్మరణీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వరరావు, మేనేజర్ సుదర్శన్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- శ్రీ రామ సత్యనారయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన : తాళ్ల జగదీష్ గౌడ్



**జయభేరి, సెప్టెంబర్ 9:**

శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ రామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లారెడ్డి ఆయురారోగ్యాలు ఉండాలని అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జగదీష్‌గౌడ్ మట్లాడుతూ నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందిస్తూ ప్రజల కోసం ఎల్లవేళలా పనిచేసే వ్యక్తి మల్లారెడ్డి అని ఆయన ఇలాటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో "ప్రజావాణి" లో పాల్గొని దరఖాస్తులను అందుకున్న మేయర్ తోటకూర అజయ్ యాదవ్. ఈ కార్యక్రమంలో కమీషనర్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మున్సిపల్ అధికారులు పాల్గొనడం జరిగింది.

**జయభేరి, మేడిపల్లి**

## కార్పొరేటర్ స్వంత నిధులతో స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అమృత కాలనీలో కార్పొరేటర్ లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి అద్వర్యంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్ (స్ట్రీట్ లైట్స్) బీఏఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలో వివిధ వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, నాయకులు జావేద్ ఖాన్, కాలనీ అధ్యక్షులు వెలిశెట్టి నాగరాజు, కార్యదర్శి పసునూరి భిక్షపతి, రాజు గౌడ్, లింగారెడ్డి, బాగయ్య, శివారెడ్డి, అంగిరెకుల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు ఫిలిప్స్, కృష్ణరెడ్డి, సంతోష్, కృష్ణమూర్తి, అంజయ్య, అరవింద్, రంగయ్య, సాయికిరణ్, సురేష్ చారి, లోకేష్, సాయిరాం, శ్యామ్, రాఘవేంద్ర, నాగిరెడ్డి, శ్రీనివాస్, భానుప్రసాద్, రాజశేఖర్, మహిపాల్ రెడ్డి, మోహన్, నర్సిహ్మారెడ్డి, మహేందర్ రెడ్డి, అంజయ్య, గడ్డమీది సంపత్, గోపి, సౌజన్య, భవిష్య, సునీత, పద్మ, వాసవి, నవ్య, భార్గవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు



## మానవత్వాన్ని చాటుకుందాం

- ఖమ్మం వరద బాధితులకు అండగా నిలుద్దాం
- మైనంపల్లి సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ కృషి అమోఘమైంది
- టీ.పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**జయభేరి, మేడిపల్లి :**



అకాల వర్షాలతో అతలాకుతలం అయిన ఖమ్మం ప్రజానీకాన్ని అన్ని విధాలుగా అందుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పధంతో ముందుకు రావాలని టీ.పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నాడు మైనంపల్లి సోషల్ సర్విస్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో ఖమ్మం ప్రజల సహాయార్ధం నిత్యావసర వస్తువులను అందించే కార్యక్రమాన్ని కొంపల్లిలోని మైనంపల్లి హన్మంతరావు నివాసంలో ఆయన ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అకాల వర్షాలతో ఖమ్మం ప్రజలు ఆస్తులతో పాటు ఆప్తులను పోగొట్టుకున్నారని ఇలాంటి కష్ట సమయంలో వారిని మానవత దృక్పధంతో ప్రజలందరూ అందుకునేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్దన్ రెడ్డి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్‌లు ప్రవీణ్ రెడ్డి, కొలను హన్మంతరావు, నక్క ప్రభాకర్ గౌడ్, కున్న శ్రీశైలం గౌడ్, భూపాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి మండపాలను సందర్శించిన కార్పొరేటర్

**జయభేరి, ఉప్పల్ :**



చిల్కానగర్, ఉప్పల్ డివిజన్ల పరిధిలోని చిల్కానగర్ గుట్ట, బీరప్ప గడ్డ, రాఘవేంద్ర నగర్ సాయిరాం నగర్, చిల్కానగర్ మర్రిచెట్టు ప్రాంతం, ఉప్పల్ భరత్ నగర్ లో వివిధ బస్తీల మరియు కాలనీలలో ఏర్పాటు చేసిన గణేశుడి మండపాలను కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సందర్శించారు.

ఈ సందర్భంగా విగ్నేశ్వరుడికి బన్నాల గీత ప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు, విగ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో బన్నాల గీతా ప్రవీణ్ పాల్గొని భక్తులకు వడ్డించారు, న్యూ ప్రశాంత్ నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి కార్పొరేటర్ గీత ప్రవీణ్ లడ్డూని బహూకరించారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రామాంజనేయులు, శ్యామ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున మొదలగు వారు పాల్గొన్నారు.



## గండ్లు పడిన చోట ఇసుక బస్తాల ఏర్పాటు

**జయభేరి, కైకలూరు :**

భారీ వర్షాలు చేపల చెరువుకు తీవ్ర నష్టం కలిగించాయి పలు ప్రాంతాల్లో చాపల చెరువులకు గండ్లు పడే పరిస్థితి ఏర్పడింది మునేపల్లి మండలం బొమ్మనంపాడు గ్రామంలో చెరువుగట్టు భారీ వర్షాల వల్ల చేపల రొయ్యల చెరువులు వర్షాల వల్ల వారం రోజులుగా ముంపు తాకడికి తట్టుకోలేక బలహీన పడుతున్నాయి బసక నెలలో తవ్విన చెరువులకు నష్టం ఎక్కువ వాటిల్లుతున్నది బొమ్మనంపాడు గ్రామం లోని చేపల చెరువుకు సోమవారం గండ్లు పడ్డాయి పటిష్టం చేసేందుకు రైతులు నాన్న తంటాలు పడుతున్నారు పక్క చెరువులోకి చాపలు కొట్టుకుపోకుండా ఇసుక సంచులను ఏర్పాటు చేస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన భాస్సిం శెట్టి కిషోర్ రైతు చెరువుకు గండ్లు పడి టన్నుల కొద్ది చాపలు పక్క చెరువులోకి పొలాల్లోకి కొట్టుకుపోయాయి ఆ రైతుకు చెందిన నాలుగు ఎకరాల చాపల చెరువుకు గండ్లు పడగా సుమారు 12 టన్నులు చాపలు కొట్టుకుపోయాయి. దీంతో సుమారు 15 లక్షలు నష్టం వాటిల్లింది కొరగడ్డ పాలెం పెదగొన్నూరు. కామారు తదితర గ్రామాల చెరువులు గట్టు కూడా వర్షాల కారణంగా బలహీనమైనట్లు చెబుతున్నారు.

## ముంపుకు గురైన పంచాయతీలకు లక్ష చేయూత

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**జయభేరి, కైకలూరు:**

ఏలూరు జిల్లా మండవల్లి మండలం బైరవపట్నం గ్రామం శుభం ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అటవి, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు కొణిదల పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ముంపుకు గురైన 400 గ్రామాలకు గాను గ్రామానికి లక్ష రూపాయిల చొప్పున నష్ట పరిహారం ప్రకటించారు. దానిలో భాగంగా కైకలూరు నియోజకవర్గం లో కైకలూరు పంచాయితీలో 1, 8 వార్డులకు లక్ష, మండవల్లి మండలం లో పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక, కొవ్వాడలంక, మణుగునూరు గ్రామాలకి లక్ష రూపాయిల చొప్పున మంజూరయిన చెక్కులను ఆయా గ్రామ సర్పంచులకు పెద్దలకు అందజేసిన శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, NDA నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంని కలిసిన మాజీ ఎంపీపీ రేఖ



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాదులోని రవీంద్ర భారతి లో జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ ఎంపీపీ రేఖ శ్రీధర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్చాన్ని అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి తండ్రి కావడంతో తన కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రిని కలిశారు. కొండమల్లేపల్లి మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొండమల్లేపల్లి మండల పరిధిలో పనిచేసేటటువంటి పత్రిక విలేకరులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిధిలో తన సొంత నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్న మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం ముఖ్యమంత్రి దగ్గరగా ఉండడంతో మరిన్ని అభివృద్ధి పనులు కొండమల్లేపల్లి లో జరుగుతాయని మండల ప్రజల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలు అయినటువంటి ప్రాథమిక వైద్యశాల, ప్రభుత్వ పాఠశాలలు, ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రజల అవసరాలను తీర్చేందుకు వాటిని మెరుగుపరిచేందుకు తాను ఎల్లవేళల కృషి చేస్తానని అన్నారు.

## సొంత నిధులచే రోడ్డుపై గుంతలలో మట్టి పో పించిన మాజీ సర్పంచ్



**జయభేరి, చింతపల్లి :**

తీదేడు గేటు (స్టేజ్)దగ్గర నుండి తీదేడు గ్రామం వరకు ఉన్న బి టి రోడ్డుకు అక్కడక్కడ గుంతలు పడ్డాయి,వాహన దారులు చాలా ఇబ్బంది పడుతున్నారు,ఇబ్బందిని గమనించిన తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి సొంత నిధులతో గుంతలను మొత్తం మట్టితో లెవల్ చేపించిన తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి.

# ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- సమాజ పరివర్తనలో చదువు అగ్రభాగాన ఉంటుందని అలాంటి విద్యను బోధించే ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్

**జయభేరి, దేవరకొండ :**



డా. సర్వేపల్లి రాధా కృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు దేవరకొండ పట్టణంలో దేవరకొండ,కొండమల్లేపల్లి ఉమ్మడి మండలాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక PPR ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ గారి జయంతి సందర్భంగా అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనకు తాను సంస్కరించుకొని సమాజ పురోభివృద్ధికి పాటు పడే విధంగా ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని కొనియాడారు.
ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది పిల్లలు పాఠశాలల్లో చదువుకుంటున్నారని.. అందులో కేవలం 22 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని... మిగిలిన వారంతా ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని వివరించారు. ఇటీవలే ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించి బదిలీలు సైతం పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వం తరఫున అన్ని చేస్తున్నాం కాబట్టి ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి నాణ్యమైన విద్యను బోధించాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, విద్యార్థులకు ప్రేరణ కల్పించాల్సిందిగా సూచించారు. మధ్యతరగతి కుటుంబంలో లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ విద్యాలయాల్లో పిల్లలను చదివించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, అందువల్ల పిల్లలు వారి తల్లిదండ్రులతో తరచు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. సమాజాన్ని సంస్కరించే వ్యక్తులుగా ఉపాధ్యాయులు నిలవాలని.. వారి అవసరాలు వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 40 మంది ఉపాధ్యాయులను శాలువాలు కప్పి మెమోంటోలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,మండల పార్టీ అధ్యక్షులు లోకసాని శ్రీదర్ రెడ్డి,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య,యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్ నాయక్,MEO మాత్ర నాయక్, ఎంపిడిఓలు నిలిమ, రాంరెడ్డి, STF వెంకటయ్య,UTF సంజిబ్ కుమార్, అబిల్ ఆలి, PRTU లోక్య నాయక్, అంజయ్య,TPUS శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దొరను ఎదిరించిన ధీర వనిత

- ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని మోస్తూ దొరలను గడీలనుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని,ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత, తెలంగాణ పౌరుషాన్ని,త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు



దొరను ఎదిరించిన ధీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెను గుర్తు చేసుకుంటూ.. చిట్యాల ఐలమ్మ ఈ పేరు చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. కాని చాకలి ఐలమ్మ అంటే తెలియనివారు ఉండరు ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని మోస్తూ దొరలను గడీలనుంచి ఉరికించి తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత, తెలంగాణ పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ. ఆధిపత్యవాదంపై ఎక్కుపెట్టిన ఆయుధం ఆమె. అన్యాయాన్ని నిలదీసిన సివంగి. వివక్షపై వీరోచితంగా పోరాడిన యోధురాలు. దొరతనాన్ని ఎదిరించిన ధీరత్వం ఆమె సొంతం. భూస్వాములపై గర్జించిన వీరవనిత. ఆకలికి అతి చేరువైన చాకలి కులంలో జన్మించింది ఐలమ్మ.
1895లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో ఆమె కళ్లు తెరిచింది. మల్లమ్మ, సాయిలు దంపతుల ముద్దుబిడ్డ. చిన్న, చితక కులాలు, చేతి వృత్తిదారులు అరిగోస పడుతున్న కాలమది. భూస్వాములు, పటేల్, పట్వారీల పదఘట్టనల కింద బలహీనులు నలిగి అణగారుతున్న రోజులవి. మట్టిలో పుట్టి వెట్టిలో మగ్గిన జాతి నుంచి వెలుగురేఖలాగా దూసుకొచ్చింది. చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన ఆశాదీపం. ఆనాటి సామాజిక పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉండేవి. దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీలు కనపడితేనే భయం భయంగా, బిక్కు బిక్కుమంటూ దయనీయంగా బతకాల్సిన పరిస్థితి అణగారిన వర్గాలది. శ్రామిక మహిళల మాన, ప్రాణాలకు రక్షణ ఉండేది కాదు. చిన్న వయస్సులోనే పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో పెళ్లి అయింది. ఆమెకు ఐదుగురు కొడుకులు,



**ఆలేటి రమేశ్**
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
రజక విద్యార్థి సంఘం
9948798982

ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుటుంబం కావడంతో పూటగడవడం కష్టంగా ఉండేది. వృత్తి పని చేసినా సరైన భుక్తి కలిగేది కాదు. ఆ పరిస్థితుల్లో పాలకుర్తి పరిసరాల్లో మల్లంపల్లి దొర వద్ద రెండు ఎకరాల భూమిని ఐలమ్మ కుటుంబం కౌలుకు తీసుకొని సాగు చేసేది. ఇది పాలకుర్తి పొరుగునే ఉన్న విస్నూరు గ్రామానికి చెందిన దొర రామచంద్రారెడ్డికి కోపం తెప్పించింది.
ఐలమ్మ కుటుంబం సొంతంగా భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకోవడం సహించలేకపోయాడు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని పెద్ద దేశ్‌ముఖ్‌లలో విస్నూరు రామచంద్రారెడ్డి ఒకరు జనగామ తాలూకాలోని 40 గ్రామాల్లో 40వేల ఎకరాల భూమి ఉన్న దేశ్‌ముఖ్ ఆయన. విస్నూరు దొరకు నరరూప రాక్షసుడనే పేరు ఉండేది. బువ్వకు లేనోళ్లు భూమి గురించి ఆరాటపడటమంటే తలెత్తుకుని సగర్వంగా నిలబడటం కిందే లెక్క. అది దొర ఆధిపత్యానికి సవాల్ అన్నమాటే. ఐలమ్మ భర్తను, కొడుకును జైలుపాలు చేశాడు. ఐలమ్మ పొలాల్లోని పంటలను గూండాలతో కొల్లగొట్టించాలని చూశాడు. ఐలమ్మ ధీరోద్ధాతగా నిలబడి ఎదిరించింది. కొంగు నడుముకు చుట్టి కొడవలి చేతబట్టి సివంగివలే గర్జించింది. కమ్యూనిస్టు కార్యకర్తల సహాయంతో గూండాలను తరిమికొట్టింది. ఒడుపుగా పంటను ఇంటికి చేర్చింది. ఐలమ్మపై దొర అంతకంతకు కక్ష పెంచుకుని గూండాలతో దాడులు చేయించేవాడు. ఆమె మాత్రం ఆత్మవిశ్వాసాన్నే ఆయుధంగా చేసుకొని ఎదిరించేది. "నీ గడీల గడ్డి మొల్తది" అని తూటాల్లాంటి మాటలతో దొరను గడగడలాడించింది. అప్పట్లో ఆమెతోపాటు కమ్యూనిస్టు నాయకులపై పాలకుర్తి దొమ్మి కేసు పెట్టించాడు దొర. ఖూనీకోర్లతో దాడి చేయించాడు. కోర్టుకు విన్నవించుకుందామని వెళ్తుంటే భువనగిరి సమీపంలో వారిపై దాడి చేయించాడు. తీవ్రగాయాలతోనే హైదరాబాద్ వచ్చారు. ఈ సంఘటనను 'మీజాన్' ఉర్దూ, తెలుగు దినపత్రికలో సంపాదకులు అడివి బాపిరాజు ప్రముఖంగా ప్రచురించారు. విస్నూరు దొర ఆగడాలకు ఆమె కుటుంబం ఛిద్రమైంది. పోరాటంలోనే కొడుకు, భర్త ప్రాణాలు వదిలారు. అయినా వెరవలేదు. అగ్నికణం వలె నిత్యం ఉద్యమనెగళ్లను కాపాడేది. భూపోరాటాలకు దారి చూపి నైజాం రాజ్యం పతనానికి పునాదులు వేసిన వీరనారి చాకలి ఐలమ్మ. ఆమె వర్ధంతి సందర్భంగా ఆమెకి ఘన నివాళులు.

## కాళోజీ జీవితం దేశానికి ఆదర్శం

- తెలంగాణ మహోపాధ్యాయుడు కాళోజీ
- మహనీయుడి ఆశయాలను కొనసాగిద్దాం
- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**జయభేరి, దేవరకొండ :**



కాళోజీ నారాయణరావు జీవితం దేశానికి ఆదర్శం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం దేవరకొండ పట్టణంలో కాళోజీ జయంతి వేడుకలలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తెలంగాణ ముద్దు బిడ్డ కాళోజీ విశ్వమానవుడు, విశ్వకవి,మహోపాధ్యాయుడు అని ఆయన కొనియాడారు.జీవిత పయనంలో ఏ సందర్భంలోనూ పదవులకు, డబ్బుకు ఆయన లొంగలేదని పేర్కొన్నారు. కాళోజీ లాంటి ఉన్నతమైన వ్యక్తిత్వాల వారు నేటి తరానికి ఆదర్శం అని ఆయన అన్నారు. మహోన్నత వ్యక్తిత్వానికి కొలమానం లేదని అన్నారు. అస్తిత్వం కోసం జాతిని జాగృతం చేసిన ప్రజాకవి, మహనీయుడు కాళోజీ నారాయణరావు అని, ఆయన జీవితం దేశానికే ఆదర్శమన్నారు. కాళోజీ కళా క్షేత్రం కోసం 3 ఎకరాల స్థలం తో పాటు 12 కోట్ల రూపాయలను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. నైతిక విలువలు, మానవత్వం అంతరించి పోతున్న ప్రస్తుత తరుణంలో కాళోజీ వంటి మహనీయులు మళ్లీ పుట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిండి మండల అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర రావు, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, మాజీ జెడ్పిటిసి బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,గాజుల రాజేష్,TRSV రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు ,రమావత్ మోహన్ కృష్ణ,TRSV దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ మాజీ సర్పంచ్,రేపాని ఇద్దయ్య, జనీబాబా,గెలమోని శ్రీను,బాబా(బి ఎన్ ఆర్ కాలనీ),చంద్రమౌళి, పొట్ట మధు,మైనంపల్లి ప్రవీణ్,గండూరి లక్ష్మణ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య భేరి

### శరీరముచల్లే వాసనలోనే బ్రతుకు కూరుకుపోయింది

లోనఊపిరి...
ఎక్కడెక్కడో తగులుతుంది
అక్కడక్కడా నేను బ్రతికేఉన్నాను...

బ్రతకడమంటే...
చినుగులుపడ్డ నాలుకాళ్ళ మంచముపై
పోగేసిన ఎముకలగూడులా పరచపడి ఉన్నాను...

కలలన్నీ కుక్కిన మంచములోనే...
కళ్ళుమూసినపుడు కన్నీళ్లకల్లములో రాలుతుంటాయి
రాలి రాలాగానే తడి ఆరుతుంటాయి

ఇన్నాళ్లు...
జీవితము ఇంతపొడువుగా
మంచములోనే మడతపెట్టిఉన్నట్టు...

మగతనిద్ర మనసుకు చెప్పలేదు...
చీకటివెలుగు ఒకేలా నన్నుదాటి వెళ్లిపోతుంది

తాళ్లతో కట్టకున్నా...
మంచము నాబరువును గట్టిగానే పట్టుకుంది

తాడుతో పేనినట్టు...
సన్నని శరీరము మంచానికి అతుక్కుపోయింది...

రోజు ప్రపంచమంత...
ఎక్కడో ఉందనుకుంటున్నాను...

నా శరీరముపై కాలముకప్పిన వల
కత్తిరించుకొని ఎగిరిపోదమనుకున్నాను...

కానీ... ప్రపంచమంత
కుక్కిన మంచములోనే ఉంది...

కుమిలే దుఃఖములోనే ఉంది
కూడుదిగని గొంతులోనే ఉంది...

శరీరముచల్లే వాసనలోనే బ్రతుకు కూరుకుపోయింది...



**కృష్ణ మారుపాక**
(త్రిపుర సుందరి)
90594 74032


# భారీ వినాయకుడు.. నవరాత్రులు.. ట్రాఫిక్

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 9:





వినాయక చవితి వచ్చిందంటే రాజధాని నగరంలో ఏ గల్లీ చూసినా వినాయక మంటపం కనిపిస్తుంది. నవ రాత్రులు భక్తులు ఫుల్ హుషారుగా ఈ వేడుక చేసుకుంటారు. ముఖ్యంగా హైదరాబాద్ గణేషుడు అంటే వెంటనే ఖైరతాబాద్ విఘ్నేషుడు గుర్తుకు వస్తాడు. ఈ నవరాత్రుల్లో కనీసం 30 నుంచి 40 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఇక్కడ భారీ బందోబస్తుతోపాటు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్లు కూడా చేస్తుంటారు. ఈ సారి కూడా ఖైరతాబాద్ గణేషుడి మంటపం చుట్టూ పలు మార్గాలను వాహనదారులకు మూసేశారు. అందుకు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచించారు. ఈ మార్పులు పది రోజులపాటు అంటే వినాయక మహానిమజ్జనం వరకు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి రైల్వే గేట్ దాటి ఖైరతాబాద్ గణేషుడి విగ్రహం వైపునకు వచ్చే దారిలో వాహనాలకు అనుమతి లేదు. సచివాలయం వెనుక వైపున మింట్ కాంపౌండ్ నుంచి ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహం వైపునకు అనుమతి లేదు. ఖైరతాబాద్ పోస్టాఫీస్ నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వద్దకు గల దారిని కూడా వాహనాలకు మూసేస్తారు. రాజ్ దూత్ లేన్ నుంచి ఖైరతాబాద్ విగ్రహం వద్దకు వచ్చే దారిలో కూడా వాహనాలకు అనుమతి లేదు. నెక్లెస్ రోటరీ నుంచి ఐమాక్స్, సైఫాబాద్ పోలీసు స్టేషన్ మీదుగా మింట్ కాంపౌండ్ వైపు వచ్చే దారిలో కూడా వాహనాలను అనుమతించరు.ఈ దారులకు ప్రత్యామ్నా మార్గాలను కూడా ట్రాఫిక్ అధికారులు సూచించారు. మింట్ కాంపౌండ్ వైపు నుంచి ఖైరతాబాద్‌కు వెళ్లే వారు.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ కింది నుంచి సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ గార్డెన్.. రోటరీ నెక్లెస్.. ఆ తర్వాత ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ ఎక్కేసి వెళ్లిపోవచ్చు. అలాగే.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు నుంచి ఇక్బాల్ మినార్.. అక్కడి నుంచి సైఫాబాద్ ఓల్డ్ పీఎస్.. అక్కడి నుంచి నిరంకారి నుంచి నేరుగా ఖైరతాబాద్ జంక్షన్‌కు వెళ్లవచ్చు.ఖైరతాబాద్ మహా గణేషుడి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్క్ చేసుకోవడానికి కూడా కొన్ని పార్కింగ్ ప్లేస్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. నెక్లెస్ రోటరీ సమీపంలో ఐమాక్స్ పక్కనున్న అంబేద్కర్ స్క్వేర్‌లో తమ వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఐమాక్స్‌కు ఎదురుగా, ఎన్టీఆర్ గార్డెన్, సరస్వతి విద్యా మందిర్, రేస్ కోర్స్ రోడ్.. ఈ ఏరియాల్లో పార్కింగ్ చేసుకోవచ్చు.వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా చేస్తున్నారు. ఊరూవాడ వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నారు. వరుణుడి కాస్త శాంతించటంతో చాలాచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ వినాయకుడు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈసారి 70 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా 70 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహిస్తున్నారు. 7 అంకెకు ప్రాధాన్యమిస్తూ 7 తలలు, 7 సర్పాలు రెండు వైపులా 7 చొప్పున మొత్తం 14 చేతులతో విఘ్నేశ్వరుడిని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ 28 అడుగుల వెడల్పుతో విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించింది. సప్తముఖ మహాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. భారీ వినాయకున్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు సెలవు రావటంతో ఎక్కువ మంది భక్తులు తరలివచ్చారు. ఇంకోవైపు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు.



## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి,

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింతగా బలపడుతోందని, దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రెండు రోజులు జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడీఓలు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిందని జిల్లా యంత్రాంగం సూచనలను పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలుఇండ్ల నుండి బయటకి రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. వరద నీరు చేరి ప్రమాదకరంగా ఉన్న రహదారుల్లో ప్రయాణాలు చేయొద్దని అట్టి రహదారుల్లో రవాణా నియంత్రణకు భారికేడింగ్, ట్రాక్టర్లు వంటి వాహనాలు అడ్డుపెట్టాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. చెరువులు పటిష్ఠతను పరిశీలిస్తూ పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నదులు, చెరువులను చూసేందుకు ప్రజలు వెళ్ళొద్దని ప్రమాదం పొంచిఉందని ఆయన తెలిపారు. వర్షాలు తగ్గే వరకు వ్యవసాయ కూలీలు పనులకు వెళ్ళొద్దని తెలిపారు. పశువులను మేతకు వదలకుండా ఇంటి పట్టునే ఉంచాలని, ముంపు గ్రామాల్లో ఎత్తైన ప్రదేశంలో పశువులు ఉంచాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళొద్దని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విపత్తువేళ ప్రజల రక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా అకస్మాత్తుగా వాగులు, చెరువుల్లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఏదేని అత్యవసర సేవలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కలెక్టరేట్ నందు 24 గంటలు పనిచేయు విధంగా ఏర్పాటు చేసిన 9030632608, 18004251123 కంట్రోల్ రూము నంబర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

## ఖమ్మంలో మరోసారి డేంజర్ బెల్స్

జయభేరి, ఖమ్మం, సెప్టెంబర్ 9:



ఖమ్మంలో మరోసారి డేంజర్ బెల్స్ నెలకొన్నాయి. రాత్రి కురిసిన భారీ వర్షానికి మున్నేరు నదికి వరద పెరిగింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగింది.రాత్రి కురిసిన భారీ వర్షానికి మున్నేరుకు వరద క్రమంగా పెరుగుతుంది. దాదాపు రాత్రి 8 అడుగుల నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం 16 అడుగులు దాటి ప్రవాహం వస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యాయి.ఈ నేపథ్యంలో శివారు కాలనీలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. దానవాయిగూడెం, రామన్నపేట, ప్రకాష్ నగర్, మోతీనగర్ ముంపు ప్రాంతాల ప్రజలను అర్ధరాత్రి పునరావాస కేంద్రాలకు తరలించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.మరోవైపు, భారీ వర్షాలు, వరదలతో ప్రధాన నదులు పొంగిపొర్లుతున్నాయి. అయితే రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దాదాపు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం వాయుగండంగా మారనుంది. మూడు రోజుల పాటు వాయు గుండం కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది.ఇదిలా ఉండగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాత్రి ఖమ్మం చేరుకున్నారు. వరద ప్రాంతాల్లో పర్యటించారు. మున్నేరు శివారు ప్రాంతంలోని ప్రజలను పరామర్శించారు. వరద ఉద్ధృతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.అలాగే, మున్నేరు నది లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం సహాయక చర్యల శిబిరాలను మళ్లీ తెరవాలని ఆదేశించారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అర్ధరాత్రి భారీ వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అత్యధికంగా మహబూబాబాద్‌లో 18.2 సెం.మీ వర్షపాతం నమోదైంది.ఖమ్మంలో జిల్లా తల్లాడలో 12.2 సెం.మీ, రంగారెడ్డి జిల్లా చుక్కాపూర్‌లో 11.1సెం.మీ, అమనగల్‌లో 9.8, భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో 9.3 సెం.మీల వర్షం కురిసింది. ఈ వర్షాలకు మున్నేరు నదితోపాటు పలు వాగులకు వరద ఉధృతి పెరిగింది. ఇదిలా ఉండగా, ఖమ్మం జిల్లా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించనున్నారు. ఖమ్మంలోని 16వ డివిజన్ ధంసాలపురంలో వరద బాధితులను పరామర్శించనున్నారు. పాలేరు నియోజకవర్గంలోని తిర్మలాయపాలెం, రాకాసి తండాలో బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద బాధితులకు కిషన్ రెడ్డి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నారు.



## కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు

జయభేరి, కత్బుల్లాపూర్:

హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేతలు శరవేగంగా జరుగుతున్నాయి. .దుండిగల్ మున్సిపాలిటీ పరిదిలోని కత్వ చెరువులో 170/1సర్వే నెంబర్ లో వెలిసిన ఎనిమిది విల్లాలను నేలమట్టం చేస్తున్నారు హైడ్రా అధికారులు. మల్లంపేట్ కత్వ చెరువు ఎఫ్టిఎల్ విస్తీర్ణం 142 ఎకరాలు. మల్లంపేట్ లో లక్ష్మీ శ్రీనివాస కన్ స్ట్రక్షన్స్ పేరుతో 202021 సంవత్సరానికే 320విల్లాస్ లను నిర్మించిది ఈ సంస్థ..అప్పటికే 60విల్లాలకు మాత్రమే హెచ్ఎండీయే పర్మిషన్ తీసుకున్న ఈ సంస్థ మిగతావన్నింటిని ఫోర్జరీ పర్మిషన్ తో కన్స్ట్రక్షన్ చేసిందన్న ఆరోపణలతో అప్పటి మేడ్చల్ కలెక్టర్ హరీష్ నేతృత్వంలో డిపిఓ ఆద్వర్యంలో ఎంక్వైరీ చేసి 208విల్లాలకు ఇల్లీగల్ కన్స్ట్రక్షన్ అని నోటీసులు జారీచేసారు. సీజ్ చేశారు..హైకోర్ట్ ఆదేశాలతో ఈ అక్రమవిల్లాలకు కరెంట్ కనెక్షన్, వాటర్ కనెక్షన్,రిజిస్ట్రేషన్ లను ఆపాలని,బ్యాంక్ అధికారులు లోన్ లను నిలిపివెయ్యాలని ఆర్డినెన్స్ జారీచేశారు..చట్టంలో ఉన్న లొసుగులతో దుండిగల్ మున్సిపాలిటీ అధికారుల సహకారంతో అక్రమ విల్లాలన్ని సక్రమవిల్లాలుగామారిపోయాయి.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సిపి సుధీర్ బాబు



జయభేరి, ఘట్కేసర్:

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాదు గ్రామంలోని లక్ష్మి నారాయణ చెరువు వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను, పరిశీలించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఎదులాబాద్ లక్ష్మి నారాయణ చెరువును సందర్శించారు. కమిషనర్ సుదీర్ బాబు వెంట డిసిపి పద్మజ, , ఏసిపి చక్రపాణి, సీఐ సైదులు, పోలీస్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ నవగ్రహ యోగం...

జయభేరి, మెదక్, సెప్టెంబర్ 9:



రాజకీయ యోగానికి యాగం దగ్గరి దారని చాలా మంది నమ్ముతుంటారు. ఇలాంటి సెంటిమెంట్లను నమ్మేవారిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుంటారు.అందుకే ఎప్పటికప్పుడు యజ్ఞాలు, యాగాలతో తన భక్తి ప్రవత్తులను చాటుకుంటారు కేసీఆర్. అధికారంలో ఉండగా, రకరకాల యాగాలు చేసిన కేసీఆర్... ఇప్పుడు ప్రతిపక్షంలోనూ నవగ్రహాల అనుగ్రహం కోసం మరో యాగం చేస్తున్నారట... ఇందుకోసం తన లక్కీనెంబర్ ఆరో తేదీనే యాగం ప్రారంభించడం మరో విశేషంగా చెబుతున్నారు... తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆధ్యాత్మికత కూడా చాలా ఎక్కువ. తరచూ గుడులు, గోపురాలను దర్శించుకునే కేసీఆర్... ఎప్పటికప్పుడు యజ్ఞయాగాదులు చేస్తుంటారు. అధికారంలో ఉండగా, చాలా యాగాలను చేసిన కేసీఆర్ వాటి ఫలితాలను పొందారు. కానీ, ఎందుకనో గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ తరహా పూజలకు కాస్త దూరంగా ఉన్న కేసీఆర్... ఇప్పుడు మళ్లీ యాగం చేయడం మొదలుపెట్టారట. తన లక్కీ నెంబర్ 6 అయితే.. సెప్టెంబర్ 6న నవగ్రహ యాగాన్ని మొదలుపెట్టారు కేసీఆర్. తన వ్యవసాయ క్షేత్రంలో కేవలం కుటుంబ సభ్యుల మధ్య ఈ యాగం చేస్తున్నారు కేసీఆర్. దీంతో కేసీఆర్ సెంటిమెంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా డైలమాలో పడిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ చరిత్రలోనే లేనట్లు ఒక్కస్థానం గెలుచుకోలేకపోయింది. ఇక వ్యక్తిగతంగా కుమార్తె కవిత అరెస్టు కేసీఆర్‌ను మరింత కుంగదీసింది. ఇప్పుడు కవిత బెయిల్‌పై విడుదల కావడం.. ఇకపై ఇలాంటి కష్టాలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో నవగ్రహ యాగం చేయాలని సంకల్పించారట కేసీఆర్. ఈ యాగం తర్వాతే స్థానిక ఎన్నికల్లో క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయించారట కేసీఆర్. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్నందున మంచి రోజు చూసుకుని నవగ్రహ యాగం మొదలుపెట్టారు కేసీఆర్. ఉద్యమనేతగా తెలంగాణపై ప్రత్యేక ముద్ర వేసిన కేసీఆర్‌లో దైవభక్తి ఎక్కువ...ఉద్యమ సమయం నుంచే ఆయన ఎన్నో యాగాలు చేసేవారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహాయాగాలను చేసిన కేసీఆర్ వాటి ఫలితాలను అందుకున్నట్లు పలు సందర్భాల్లో చెప్పారు. 2015లో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో 5 రోజుల పాటు ఆయుత చండీ యాగం నిర్వహించిన కేసీఆర్... 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం చేసి రెండోసారి రాజయోగాన్ని ఒడిసిపట్టుకున్నారు. ఐతే 2023 ఎన్నికలకు ముందు రాజ శ్యామల యాగం మళ్లీ చేసినా, ఆయనకు రాజ యోగం దూరమైంది.ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మళ్లీ యాగం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ యాగం పూర్తయిన తర్వాత తెలంగాణ భవన్లో పార్టీ నేతలతో నేతలతో కీలక సమావేశం ఏర్పాటు చేయనున్నారు కేసీఆర్. మరోవైపు కేసీఆర్ చేస్తున్న నవగ్రహ యాగంలో ఎమ్మెల్సీ కవిత కూడా పాలుపంచుకోగా, కుమారుడు కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకుని 7వ తేదీన యాగంలో భాగస్వామి అవుతారని చెబుతున్నారు.మొత్తానికి నవగ్రహాల అనుగ్రహించాలని కోరుతూ కేసీఆర్ చేస్తున్న యాగం ఎంతవరకు ఫలితమిస్తుందో కానీ, ఆయన సెంటిమెంట్ వర్కవుట్ కావాలని బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం బలంగా కోరుకుంటున్నాయి.

## కోతకు గురైన బ్రిడ్జిలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి



జయభేరి, ఖమ్మం :

ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి, నామవరం బ్రిడ్జిల వద్ద మున్నేరు వాగు వరద ఉదృతితో కోతకు గురైంది.దీనితో ఆ ప్రాంతాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులతో కలిసి పరిశీలించారు.బ్రిడ్జి పరిరక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం వరదలకు గురైన పంట పొలాలను పరిశీలించారు.వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని ఆయన సూచించారు

## అక్రమంగా తరలిస్తున్న గంజాయి



జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం:

జూలూరుపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్సై రాణా ప్రతాప్, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ప్రవీణ్ తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. పట్టుబడిన కారు, ద్విచక్ర వాహనాన్ని స్టేషన్కు తరలించి పోలీసులు విచారించారు. కారులో 246 కేజీల గంజాయిని సీలేరు నుండి హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు నిందితులు విచారణలో వెల్లడించినట్టు కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు 80 లక్షల ఉంటుందని డిఎస్పి తెలిపారు. పట్టుబడ్డ నిందితులు బూర్గంపాడు మండలం సారపాక కు చెందిన శివశంకర్ రెడ్డి, నాగేంద్రబాబుగా గుర్తించడం జరిగిందన్నారు. నిందితుల్లో ఒకరైన శివ శంకర్ రెడ్డి పై గతంలో పాల్వంచ టౌన్, భద్రాచలం పోలీస్ స్టేషన్, బూర్గంపాడు పోలీస్ స్టేషన్, మలక్పేట్ పోలీస్ స్టేషన్, మోతుగూడెం పోలీస్ స్టేషన్ లతోపాటు మహారాష్ట్రలోని లాతూర్ పోలీస్ స్టేషన్లో ఆరు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు డిఎస్పి వెల్లడించారు. ఇతను గంజాయి పై అక్రమంగా కూడగట్టిన ఆస్తులను సైతం స్వాధీనం చేసుకోనున్నట్లు డిఎస్పీ తెలిపారు. గంజాయి అమ్మిన సేవించిన చట్టరీత్యా నేరమని అలా ఎవరైనా గంజాయి విక్రయానికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని డి.ఎస్.పి సూచించారు.ఈ కేసులో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న జూలూరుపాడు ఎస్సై టాస్కోర్స్ సిఐ మరియు ఎస్ఐలకు రివార్డు అందిస్తున్నట్లు డిఎస్పి వెల్లడించారు..

## విశాఖ చేరుకున్న అక్కినేని నాగార్జున

జయభేరి, విశాఖపట్నం:



సినీ నటుడు అక్కినేని నాగార్జున విశాఖ విమానాశ్రయంలో సందడి చేసారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో నాలుగు రోజులు షూటింగ్లో పాల్గొనడానికి సాయంత్రం బేగంపేట నుండి ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయం అక్కినేని నాగార్జున చేరుకున్నారు. తరువాత అయన విశాఖ విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన నగరంలో రాడిసన్ బ్లూ హోటల్ కి బయలుదేరారు.

# మూవీభేరి

## ప్రైవేట్ పార్ట్ చూపించి టెంప్ట్ చేస్తోన్న ఆషురెడ్డి

ఆషురెడ్డి క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆమె ఎలా కనిపించినా అందనికే అందం అనేలా క్రేజ్ అందుకుంది. నటిగా కెరీర్ మొదలుపెట్టిన ఆషురెడ్డి, ఆ తర్వాత యాంకర్ అవతారం ఎత్తింది.పలు షోలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ తన పాపులారిటీని మరింత పెంచుకుంటోంది ఈ బ్యూటీ. అందం, టాలెంట్, వినోదంతో ప్రేక్షకులను అలరిస్తూ, తానేంటో ని రూపించుకుంటోంది.జూనియర్ సమంతగా ఆషురెడ్డి ఫుల్ పాపులారిటీని సంపాదించుకుంది. నటిగా కెరీర్ మొదలుపెట్టిన ఆషురెడ్డి, ఆ తర్వాత యాంకర్ అవతారం ఎత్తింది. "చల్ మోహన రంగా" చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన ఆషురెడ్డి, "బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్"అనే చిత్రంలో హీరోయిన్ గా కనిపించింది.ప్రస్తుతం "ఏ మాస్టర్ పీస్" అనే మూవీలో నటిస్తోంది. ఈ సినిమా టీజర్ ఇటీవలే విడుదలైంది.ఇక రియాల్టీ షో బిగ్‌బాస్‌లో సైతం అడుగుపెట్టి తన క్రేజ్ అమాంతం పెంచుకుంది. ఇక వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో ఆషురెడ్డి చేసిన ఓ ఇంటర్వ్యూ ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికి తెలిసిందే. నాగార్జునను వణికించిన స్టార్ హీరోయిన్..? ఆ ఇంటర్వ్యూలో ఆషురెడ్డి పాదాలను రామ్ గోపాల్ వర్మ తాకడం పెద్ద వివాదంగా మారింది. ఇక సోషల్ మీడియాలో అమ్మడు చేసే రచ్చ అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆషురెడ్డి ఎప్పటికప్పుడు తన వ్యక్తి విశేషాలతో, పాటు తన లేటెస్ట్ ఫొటోస్‌ను సైతం షేర్ చేస్తోందితాజాగా మరోసారి సోషల్ మీడియాలో తన లేటెస్ట్ ఫొటోషూట్‌ను అభిమానుల ముందుంచింది.





## బిగ్‌బాస్ ఊపిరి పీల్చుకో..

బుల్లితెర పాపులర్ నటి జ్యోతి రాయ్ వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్ స్టార్టింగ్‌లోనే బిగ్‌బాస్ టీమ్ ఆమెను సంప్రదించారని కానీ షూటింగ్స్ వల్ల వేల్లలేకపోతున్నానని ఆమె తెలిపారు. జ్యోతిరాయ్ హౌస్‌లోకి వెళ్లబోతున్నట్లు వార్తలు వైరల్ అవుతుండటంతో ఆమె ఫ్యాన్స్ ఆనందపడుతున్నారు. కాగా, జ్యోతి రాయ్ బుల్లితెరపై గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా ఫుల్ పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇందులో సంప్రదాయ లుక్‌లో కనిపించే జ్యోతి రాయ్ ..సోషల్ మీడియాలో మాత్రం తన హాట్ పిక్స్ షేర్ చేసి అందరి దృష్టి తన వైపుకు తిప్పుకుంటోంది. మరి ఈ బ్యూటీ బిగ్‌బాస్‌లో ఎంట్రీ ఇస్తే ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## ఏమో గుర్రం ఎగరావచ్చు..



ఎన్టీఆర్, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కలిసి మాట్లాడుకోవడం.. వీరిద్దరూ కలిసున్న స్టిల్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. నిజానిక్కూడా ఇది షాకింగ్ కాంబినేషనే. వీరిద్దరూ కలిసి పనిచేస్తే.. అనే ఊహకే గూజ్‌బంప్స్ వచ్చే స్థాయి. నటుడిగా ఎన్టీఆర్ ఏంటో.. దర్శకుడిగా సందీప్‌రెడ్డి వంగా శైలి ఏమిటో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ ఇద్దరూ కలిస్తే ఆ సినిమా 'యానిమల్' కాదు, 'డైనోసారే' అవుతుందనేది చాలామంది అభిప్రాయం. నిజానికి వీరిద్దరూ చాలా బిజీ. తారక్ 'దేవర 1' ఈ నెల 27న విడుదల కానుంది. మరోవైపు ఆయన బాలీవుడ్‌లో 'వార్ 2' చేస్తున్నారు. ఇంకోవైపు ప్రశాంత్‌నీల్ సినిమా ఉండనేవుంది. ఆ తర్వాత 'దేవర 2'.. ఇలా క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిస్తున్నారు తారక్. సందీప్‌రెడ్డి వంగా కెరీర్ కూడా ఇంచుమించూ అలాగే ఉంది. ప్రస్తుతం ఆయన 'స్పిరిట్' స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. షూటింగ్‌ని నిరవధికంగా ఏడాదిపాటు ప్లాన్ చేశారట. పైగా ప్రభాస్‌ని కూడా ఏడాది డేట్లు అడిగారని బాలీవుడ్ టాక్. మరోవైపు 'యానిమల్ సీక్వెల్' ఉండనే ఉంది. ఇవిగాక పైప్‌లైన్‌లో సందీప్‌కి చాలా కమిట్‌మెంట్లున్నాయి. మరి వీరిద్దరూ కలిసేదెప్పుడు? సినిమా చేసేదెప్పుడు? సినిమా పరిశ్రమలో ఏమైనా జరగొచ్చు.. ఏమో గుర్రం ఎగరావచ్చు..



## వినోదాలు పంచే సారంగపాణి

ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. రూప కొడువాయూర్ కథానాయిక. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే పనుల్లో ఉంటుందా? అనే ప్రశ్నలకు సమాధానాలిస్తూ ఆద్యంతం చక్కటి హాస్యంతో సాగే చిత్రమిది.

హైదరాబాద్, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. ఈ నెల 12 నుంచి డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తాం. మా బ్యానర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అన్నారు. వీకే నరేష్, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, రచనదర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com